నిర్మాణం పూర్తి కాలేదు..

ప్రజల వెతలు తీరలేదు

- నిర్మాణ దశలోనే ఆరోగ్య ఉప కేంద్రం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు
- పట్టించుకోని అధికారులు

8

పిల్లల, మహిళల రక్షణకు పెద్దపీట

- హాట్‌స్పాట్ల వద్ద ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేయాలి : సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 10 : పిల్లలు, మహిళల రక్షణకు పెద్దపీట వేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ షీటీం, భరోసా సెంటర్ సిబ్బందికి సూచించారు. షీటీం, భరోసా సెంటర్ సిబ్బందికి నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలపై మంగళవారం ఆమె కమిషనర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. షీటీం, భరోసా సిబ్బంది, అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. స్కూల్స్, కాలేజీల్లో షీటీం కార్యక్రమం అయిన తర్వాత సంబంధిత టీచర్లు, పిల్లలతో కాసేపు సరదాగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. టీచర్లు విద్యార్థినుల్లో ఏమైనా మార్పులు కనిపిస్తే వెంటనే సంబంధిత షీటీం సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. పిల్లలు సోషల్‌మీడియాకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహించేప్పుడు ఫోక్సో కేస్ స్టడీలను తెలియజేయాలని సూచించారు. హాట్‌స్పాట్ పరిసర ప్రాంతాల్లో షీటీమ్ కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. షీటీం జిల్లా నంబర్, సిబ్బంది నంబర్లు కనపడేలా కాలేజీలు, స్కూళ్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. సమీక్షలో మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, మూడు డివిజన్ల షీటీమ్ సిబ్బంది, సిద్దిపేట భరోసా సెంటర్, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సంగారెడ్డి రోడ్లకు మహర్దశ

- సమీక్షించిన మంత్రి దామోదర, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి
- నేషనల్ హైవేను కలిపేలా 80ఫీట్ల రహదారులు
- నాలుగు రోడ్లకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశం

సంగారెడ్డి, సెప్టెంబరు 10: సంగారెడ్డి పట్టణంలోని రహదారులకు మహర్దశ పట్టనున్నది. ట్రాఫిక్ సమస్యతోపాటు ఇరుకుగా ఉన్న పలు రోడ్లను 80ఫీట్ల విస్తీర్ణంలో విస్తరించడానికి చర్యలు చేపట్టారు. తాజాగా కలెక్టరేట్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిసి మంత్రి దామోదర రాజనర్సింహ రహదారుల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఇందులో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌తోపాటు మున్సిపల్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు. పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న రోడ్లను ఆర్అండ్‌బీకి వెంటనే బదిలీ చేయాలని సూచించారు. కొత్తగా నిర్మించే రహదారులకు ప్రతిపాదనలు సిద్ధంచేసి పంపిస్తే నిధులు మంజూరు చేయిస్తామని వారు స్పష్టం చేశారు.



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు



సంగారెడ్డిలోని రహదారుల అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

ఈ రహదారుల అభివృద్ధి

- సంగారెడ్డి ఐటీఐ పక్క నుంచి గొల్లగూడెం, కంది, ఎల్ఎంఎల్ ఫంక్షన్‌హాల్, చిమ్నాపూర్ రోడ్ మీదుగా ఐఐటీ వద్ద జాతీయ రహదారి వరకు 80 ఫీట్ల రహదారి.
- నటరాజ్ థియేటర్ నుంచి కల్పకుంట, చిమ్నాపూర్ రోడ్ మీదుగా ఐఐటీ వద్ద నేషనల్ హైవే వరకు 80 ఫీట్ల రోడ్డు.
- కొత్త బస్టాండ్ ఎదురుగా రుక్మిణీ థియేటర్ నుంచి రాజంపేట, అంతాయిపల్లి మీదుగా నేషనల్ హైవే వరకు 80 ఫీట్ల రహదారి.
- జాయింట్ కలెక్టర్ క్యాంపు ఆఫీస్ నుంచి ఎఫ్ఆర్ఎస్, ఫతేఖాన్ దర్గా, రాజంపేట, వడ్డెరకాలనీ, రాంచంద్రనగర్ కాలనీ, మల్కాపూర్ చౌరస్తా జంక్షన్ మీదుగా జాతీయ రహదారిని కలుపుతూ 80ఫీట్ల రోడ్డు.



వేడిచేసి... వడ్డిస్తారు..!

అంతా నాసిరకం.. కల్తీమయం

పుట్టగొడుగుల్లా దాబాలు.. బిర్యానీ సెంటర్లు

- నిల్వఉంచిన మాంసంతో వేపుళ్లు
- వేయించిన ఆయిల్‌లోనే మళ్లీ మళ్లీ...
- ప్రాణాలతో చెలగాటమాడుతున్న కొందరు వ్యాపారులు
- అస్తవ్యస్తంగా కర్రీస్ పాయింట్ల నిర్వహణ
- తనిఖీలు చేపట్టని ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు10: ఘుమఘుమలాడే వాసన, నోరూరించే రుచులతో భోజనప్రియులను ఆకట్టుకుంటున్న దాబాలు, బిర్యానీ, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు జిల్లాలో రోజురోజుకూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. జంక్ ఫుడ్‌కు అలవాటు పడుతున్న భోజన ప్రియులు ఫాస్ట్ ఫుడ్, మొబైల్ టిఫిన్ సెంటర్ల వద్దకు పరుగులు తీసుకున్నారు. అయితే కొందరు వ్యాపారులు ఇదే ఆసరాగా చేసుకుని కల్తీ, నాణ్యత లేని పదార్థాలను వండివారుస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. రోజువారీగా నిల్వ ఉంచిన ఆహారాన్ని మళ్లీ వేడి చేసి విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత ఫుడ్‌సేఫ్టీ, మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. తనిఖీలూ చేపట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిల్వ ఉంచిన వాటితోనే

జిల్లాలోని పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో నాణ్యత కొరవడిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఫాస్ట్‌ఫుడ్, నాన్‌వెజ్ స్నాక్స్ సెంటర్, మిర్చి బజ్జీ దుకాణాల్లో మొదటి రోజు వాడిన నూనెనే మళ్లీ తిరిగి మరుసటి రోజు వాడుతున్నారు. మిగిలిన చికెన్‌ను ఫ్రీజ్‌లో ఉంచి మరుసటి రోజున వినియోగిస్తున్నారు. పానీపూరి, కర్రీ సెంటర్లలోనూ పరిస్థితి అధ్వానంగా మారింది. కొన్ని కర్రీ పాయింట్లలో స్వచ్ఛత, పరిశుభ్రత కొరవడింది. నాణ్యత లేని కూరగాయాలను వండి విక్రయిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

కనిపించని ఫుడ్ సేఫ్టీ అధికారులు

జిల్లాలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు హోటళ్లు, తినుబండారాలు, ఆహారానికి సంబంధంచిన వ్యాపారాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలి. కానీ కొన్ని నెలలుగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, హోటళ్లు, తినుబండారాల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. ఆహారం విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతూ డబ్బులు దండుకుంటున్న వారిపై అధికారులు ఇప్పటికైనా కొరడా ఝుళిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి



మారుతున్న జీవనశైలిలో భాగంగా సరైన ఆహార నియమాలు పాటించకపోవడం, జంక్‌ఫుడ్ అధికంగా తినడం వల్ల శరీరంలో అవసరానికి మించి కొవ్వు చేరి ఆరోగ్యం దెబ్బతింటుంది. వీలైనంత వరకు బయటి ఆహారాన్ని దూరం పెట్టాలి. మంచి ఆరోగ్యం కోసం ఆరోగ్యకరమైన పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, ఫైబర్ ఉన్న పదార్థాలు తినాలి.

\- డాక్టర్ క్రాంతి, జనరల్‌సర్జన్, సిద్దిపేట





నియోజకవర్గ ముఖ్యనాయకులతో ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసిన జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

కొమ్మూరి.. డోంట్ వర్రీ!

- పార్టీ అండగా ఉంటుంది.. మంచిగా పనిచేసుకో..
- ప్రతాప్‌రెడ్డికి పార్టీ నేతల భరోసా
- వేం, పొంగులేటిని కలిసిన జనగామ డీసీసీ అధ్యక్షుడు

చేర్యాల, సెప్టెంబరు 10: మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి భారీ ఊరట లభించింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నుంచి నిన్న, మొన్నటి వరకు పార్టీలో నెలకొన్న పరిస్థితులు, అంతర్గత విబేధాలు, సంస్థాగత పరిణామాల నేపథ్యంలో కొమ్మూరికి పార్టీ పెద్దల అభయహస్తం లభించింది. జనగామ డీసీసీ అధ్యక్ష పదవితో పాటు సముచితస్థానం పదిలమంటూ అధిష్ఠానం సంకేతం ఇచ్చినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఓటమి చెందిన తర్వాత పార్టీ స్థితిగతుల దృష్ట్యా నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ నేతలు డీసీసీ అధ్యక్ష పదవి నుంచి ఆయనను తొలగించాలని కోరుతూ అధిష్ఠానానికి ఫిర్యాదులు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ పలువురు ఆయనను ఖాతరు చేయకుండా ఎవరికి వారుగా వ్యవహరించారు. అప్పటికే పొన్నాల వర్గంగా ముద్రపడిన వారితో పాటు ఎన్నికల పరిమాణాల అనంతరం పలువురు ఆయనకు వ్యతిరేకంగా పావులు కదుపుతూ వచ్చారు. మంత్రులను, నాయకులను నేరుగా కలుస్తూ కొమ్మూరిపై ఫిర్యాదులు చేశారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ నియామకమవగా, ఆయనకూ కొమ్మూరికి వ్యతిరేకంగా ఫిర్యాదులు చేశారు. అయితే, మంగళవారం చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలతో పాటు జనగామ పరిధిలోని ఇతర మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులను వెంటబెట్టుకుని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. నియోజకవర్గ పరిస్థితులపై కార్యకర్తల సమక్షంలోనే చర్చించారు. "జనగామకు నువ్వే బాస్‌వి.. ఏం ఆందోళన చెందొద్దు.. అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతం కోసం పాటుపడాలని" మంత్రి పొంగులేటి ధైర్యం చెప్పినట్లు సమాచారం. "డోంట్ వర్రీ.. పార్టీ అండగా ఉంది. మంచిగా పని చేసుకో" అంటూ ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారని తెలుస్తోంది.

డెంగీతో మహిళ మృతి



గజ్వేల్, సెప్టెంబరు 10: డెంగీతో మహిళ మృతిచెందిన ఘటన గజ్వేల్ మండలం పరిధిలోని అహ్మదీపూర్‌లో మంగళవారం చోటుచేసుకున్నది. అహ్మదీపూర్ గ్రామానికి చెందిన బోయిని అనిత(35) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతూ.. సోమవారం ఉదయం రక్త పరీక్షలు చేయించుకున్నది. ఈ పరీక్షల్లో డెంగీగా నిర్ధారణ కావడంతో గజ్వేల్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. అయితే పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం బ్రెయిన్ డెడ్ అయి మృతిచెందినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త బోయిని కనకయ్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

అనుమతులిచ్చారు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
- 41 దరఖాస్తులకు అనుమతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు10: నెల రోజులకు పైగా సిద్దిపేటలోని మున్సిపల్ కార్యాలయంలో భవనాల నిర్మాణానికి అనుమతి లభించడంలేదని ఈ నెల 10న ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. నెలకు పైగా పెండింగ్‌లో ఉన్న 109 దరఖాస్తులకు మంగళవారం సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ టీఎస్‌బీపాస్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి అనుమతి ప్రక్రియను ప్రారంభించారు. 41 దరఖాస్తులకు అనుమతులిచ్చారు. త్వరలోనే మిగిలిన వాటిని కూడా పరిశీలించి అనుమతి ఇస్తామని చెప్పారు. దరఖాస్తుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన సూచించారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందిస్తూ దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా అందరికీ అనుమతినివ్వాలని, అందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌ను ఆదేశించారు.

56 రకాల నైవేద్యాలు

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుబ్బాక కేదారేశ్వర ఆలయంలో కొలువుదీరిన వినాయకుడికి మంగళవారం లక్ష గరక పూజ, 56 రకాల నైవేద్యాలతో పూజలు నిర్వహించారు.

\- దుబ్బాక, సెప్టెంబరు 10





దాతల సహకారంతో వసతి

- మలన్న సన్నిధిలో 80 గదుల నిర్మాణానికి చర్యలు
- రూ.14కోట్ల అంచనా వ్యయంతో రూపకల్పన
- సబ్‌స్టేషన్ సమీపంలో ఆలయ స్థలం కేటాయింపు
- అనుమతికోసం దేవాదాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదన

7 లో..

హుస్నాబాద్‌లో ఉద్రిక్తత

- నేషనల్ హైవే పనుల్లో రోడ్డుకు అడ్డంగా ఉన్న భవనాల కూల్చివేత
- నోటీసులు, సమాచారం లేకుండా కూల్చడంపై బాధితుల ఆందోళన
- తమ వ్యాపారం దెబ్బతింటుందని ఆగ్రహం

హుస్నాబాద్, సెప్టెంబరు 10: ఎల్కతుర్తి- మెదక్ జాతీయ రహదారి నిర్మాణం(765 డీజీ)లో భాగంగా మంగళవారం హుస్నాబాద్‌లోని ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న వ్యాపార భవనాల ముందు భాగాలను రెవెన్యూ, పోలీసు అధికారుల బందోబస్తుతో కూల్చివేశారు. దీంతో పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. హుస్నాబాద్‌లోని అనభేరి చౌరస్తా నుంచి హన్మకొండ ప్రధాన రహదారికి ఇరువైపులా 400 పైగా నివాస, వ్యాపార సముదాయాలుంటాయి. అయితే పట్టణంలో 50 ఫీట్లలో డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలతో కలిపి ఈ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. ఇప్పటికే 6 ఫీట్లతో వర్షం నీరు పోయేలా కాలువ నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు విద్యుత్ స్తంభాలను వేసేందుకు పూనుకున్నారు. అయితే అధిక శాతం భవనాలు రోడ్డు మధ్య నుంచి 40 నుంచి 45 ఫీట్ల దూరంలో ఉన్నాయి. దీంతో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాల ముందు భాగాలను అధికారులు మంగళవారం బందోబస్తు మధ్య కూల్చివేశారు. ఆకస్మిక కూల్చివేతలతో బాధితులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. వచ్చేది బతుకమ్మ, దసరా సీజన్ అని, ఇప్పుడు కూల్చేస్తే తమ వ్యాపారం దెబ్బతింటుందని ఆవేదన చెందారు. పండుగ సీజన్ అయ్యేక పూర్తి సహకారం అందించేవారమని తెలిపారు. ఇక కూల్చివేతలకు సంబంధించి ఎలాంటి ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వలేదని వారు పేర్కొన్నారు. ఇష్టానుసారంగా కూల్చివేయడంతో దుకాణాల బోర్డులు, విద్యుత్ వైర్లు, వాటర్‌పైపులు, ఇతర సామగ్రి పూర్తిగా దెబ్బతిన్నది వాపోయారు. కాగా దుకాణాల యజమానులకు వారం ముందే సమాచారం ఇచ్చామని, అయినా వారు తొలగించకపోవడంతో ఈ చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని హైవే పనుల సూపర్ వైజర్లు పేర్కొన్నారు. ఈ పనులతో ప్రధాన రహదారి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు, రెవెన్యూ అధికారులు దీనిని సమీక్షించారు.





అధికారులతో వాగ్వాదానికి దిగిన బాధితులు

హుస్నాబాద్‌లో భవనాలను కూల్చి వేస్తున్న దృశ్యం



ప్రశాంతంగా నాస్ పరీక్ష

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 10: సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన నాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పాఠశాల విద్యార్థులు చదువుల్లో కనబరుస్తున్న సామర్థ్యాలను పరీక్షించేందుకు కేంద్రం ఏటా జాతీయ సాధన సర్వే పేరిట పరీక్ష నిర్వహిస్తున్నది. ఈ విద్యా సంవత్సరం కూడా 3,6,9వ తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ముందస్తుగా అంచనాలు వేసి ప్రగతిని పెంచేందుకు వీలుగా నాస్ పరీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 3వ తరగతి 10,788 మంది, 6వ తరగతి 11,525 మంది, 9వ తరగతి 13,208 మంది మొత్తం 35,521 మంది పరీక్ష రాశారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

మెడికల్ కాలేజీలో సజావుగా ఇంటర్వ్యూలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 10: సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మంగళవారం వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ చంద్రశేకర్ సమక్షంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 94 మంది హాజరయ్యారు. వీరిలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు 46 మంది, సీనియర్ రెసిడెంట్లు 19 మంది, ట్యూటర్లు 29 మంది ఉన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.సుధామాధురి, ఇతర విభాగాధిపతులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

మానసిక వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

జిన్నారం, సెప్టెంబరు 10: జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు సమస్యలపై స్పందించే విధానం, మానసిక, వ్యక్తిత్వ నిపుణులు డాక్టర్ మధు మానసిక ఆరోగ్యం, ఏకాగ్రత పెంపుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమార్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు

రాయికోడ్, సెప్టెంబరు 10: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రాయికోడ్ మండలంలోని పలు గ్రామాల్లో నష్టపోయిన పంట పొలాలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాహుల్ సమక్షంలో రాయికోడ్ డివిజన్ ఏడీఏ సత్యనారాయణ, ఏవో సారికలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలాల్లో నీరు నిండితే తొలగించాలన్నారు. రైతులెవ్వరూ అధైర్యపడొద్దని, పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి వెంటనే సమర్పిస్తామని తెలిపారు.

కూలిన ఇళ్లకు నష్ట పరిహారం అందిస్తాం: ఆర్ఐ గంగాధర్

నిజాంపేట, సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కూలిన ఇళ్లను పరిశీలించిన నష్ట పరిహారం అందేవిధంగా కృషి చేస్తామని ఆర్ఐ గంగాధర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నందగోకులలో కూలిన ఇళ్లను పరిశీలించి మాట్లాడారు. వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు.

యాజమాన్య పద్ధతులతో ఫలితాలు: శాస్త్రవేత్త డాక్టర్ శోభ

నర్సాపూర్, సెప్టెంబరు 10: యాజమాన్య పద్ధతులతో మంచి ఫలితాలు సాధించొచ్చని నత్నాయపల్లి వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శోభ పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ వరి నాట్లు పూర్తయి జిల్లాలోని పంటలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. యాజమాన్య పద్ధతులతో పాటు సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి ఫలితం ఉంటుందని సూచించారు.

దాతల సహకారంతో వసతి

- మలన్న సన్నిధిలో 80 గదుల నిర్మాణానికి చర్యలు
- రూ.14కోట్ల అంచనా వ్యయంతో రూపకల్పన
- సబ్‌స్టేషన్ సమీపంలో ఆలయ స్థలం కేటాయింపు
- అనుమతికోసం దేవాదాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదన

చేర్యాల, సెప్టెంబరు 10 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయాభివృద్ధిలో కీలకమైన దాతల సహకారంతో భక్తులకు వసతి కల్పించేందుకు ఆలయాధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు డోనర్ స్కీంద్వారా నాలుగు అంతస్తులలో 80గదుల నిర్మాణానికి సంకల్పించారు. ఒక్కో అంతస్తులో 20గదుల చొప్పున నాలుగు అంతస్తులలో చేపట్టనున్న సముదాయానికి రూ.14కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేయగా, ఒక్కో గదికి రూ.18లక్షల చొప్పున నిధులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఆయా గదుల భవన సముదాయం నిర్మాణానికి సబ్‌స్టేషన్ సమీపంలో ఆలయ పరిధిలోని 1.15 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ విషయమై దేవాదాయశాఖ కమిషనర్ అనుమతి కోసం ఆలయ వర్గాలు ప్రతిపాదనలు పంపించడంతో పాటు దాతలకు సమాచారమిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు.

శిథిలావస్థలో వసతి గదులు

మల్లన్న ఆలయ సందర్శనార్థం వచ్చే భక్తుల బస వసతి కల్పనకు సంబంధించి ఆలయంలో ప్రభుత్వం తరుపున గదులు ఏమీ లేవు. 130కి పైగా గదులు దాతలు నిర్మించి విరాళంగా ఇచ్చినవే. వాటిని మల్లికార్జునస్వామి, మేడలమ్మ, కేతలమ్మల పేరిట బ్లాకులవారీగా కేటాయించారు. మేడలమ్మ బ్లాకులో 46, మల్లికార్జునస్వామి బ్లాకులో 22, కేతలమ్మ బ్లాకులో 60చొప్పున గదులు ఉన్నాయి. వీటిలో మల్లికార్జునస్వామి బ్లాకులో కొన్నింటిని సామగ్రి నిల్వకు వినియోగిస్తున్నారు. మరికొన్ని శిథిలావస్థలో ప్రమాదకరంగా మారాయి. ఏళ్ల క్రితం నిర్మించడంతో పెచ్చులూడి, చిన్నపాటి వర్షం కురిసినా ఊరుస్తున్నాయి. ప్రమాదకరంగా మారినప్పటికీ తప్పనిసరి పరిస్థితులలో భక్తులు బస చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. నిర్వహణ కూడా సరిగా లేకపోవ దంతో భక్తులకు ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు. కొన్నింటిని భక్తులకు ఇవ్వడం కూడా మానేశారు. జాతర సమయంలో లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నప్పటికీ ఆయా గదులను ఆలయవర్గాలకు, ప్రభుత్వ శాఖల అధికారులు, ఇతర ప్రముఖులకు కేటాయిస్తుండటంతో భక్తులు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీకావు.



వసతి గదుల భవన సముదాయనిర్మాణ ప్రతిపాదిత స్థలం

100 గదులు సంకల్పించినా...

డోనర్ స్కీం ద్వారా ప్రతిపాదిత ప్రదేశంలో ముందస్తుగా 5 అంతస్తులలో 100వసతి గదులు నిర్మించేందుకు కసరత్తు చేపట్టారు. కానీ అంచనా వ్యయం పెంపు, ఇతరత్రా కారణాలతో నాలుగు అంతస్తులలో 80 గదులు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. అందుకు ఒక్కోగదిలో హాల్, బెడ్ రూం, రెండు బాత్‌రూంలు, కిచె న్ ఉండేవిధంగా డిజైన్ చేశారు. 80గదులకు సంబంధించి అందరు దాతలు ముందుకువచ్చిన అనంతరం సమావేశం ఏర్పాటుచేసి డబ్బుల చెల్లింపు, నిర్మాణం, బ్లాకుల కేటాయింపు, ఇతర త్రా అంశాలు చర్చించి నిర్మాణం పనుల ప్రారంభించేవిధంగా కార్యాచరణ చేపట్టారు. అన్నీ కలిసివస్తే అందరూ సకాలంలో డబ్బు లు చెల్లించి పనులు చేపడితే సుమారు ఏడాదిన్నరలో 80గదుల సముదాయం అందుబాటులోకి రానుంది. అంతకుమించి దాతలు ముందుకువస్తే 5వ అంతస్తు నిర్మాణం చేపట్టేందుకు ప్లాన్ రూపొందించారు.

గతంలో 63గదులు ప్రతిపాదించినా...

కొన్నాళ్లక్రితం ఎండీఎస్-బ్లాక్‌లో 19గదులను కూల్చివేసి 63గదులను నిర్మించాలని ఆలయవర్గాలు ప్రతిపాదనలు పంపించారు. కానీ కూల్చివేయాలనుకున్న గదులకు సంబంధించిన డోనర్ల అభిప్రాయసేకరణతో పాటు ఇతరత్రా అంశాలలో సమస్యలు ఉత్పన్నమవనున్నందున పరిగణనలోకి తీసుకోకుండా వివాదరహితంగా 80గదుల భవన సముదాయానికి చర్యలు తీసుకున్నారు.

నిర్వహణభారంపై ఆసక్తి

దాతలు దశలవారీగా డబ్బులు చెల్లించనున్న క్రమంలో పనుల ఆలస్యం, పురోగతి ఇతర్రతా అంశాలపై జవాబుదారీతనంతో పాటు నిర్వహణభారం, ఆలయవర్గాల పనితీరుపై ఆసక్తి నెలకొంది. గతంలో గదుల నిర్మాణానికి విరాళాలు తీసుకున్నా నిర్మాణం చెల్లించకపోగా.. డబ్బులూ తిరిగి ఇవ్వలేదు. విషయమై ఓ అధికారిపై కేసు కూడా నమోదైంది. ఈ ప్రభావం ప్రస్తుత డోనర్ స్కీంపై చూపనుండటంతో ఏవిధంగా వ్యవహరిస్తారన్న విషయమై ఆసక్తి నెలకొన్నది.

ప్రతిపాదనలు పంపించాం..



భక్తులకు మెరుగైన వసతి కల్పించాలని డోనర్ స్కీం ద్వారా 80గదుల భవన సముదాయ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. అందుకు రూ.14కోట్ల వ్యయం కానుంది. దేవాదాయశాఖ కమిషనర్ సూచనానుసారం చర్యలు తీసుకుంటాం.

-ఈవో బాలాజీశర్మ



చాకలి ఐలమ్మ వర్ధంతి..

మెదక్ కలెక్టరేట్‌లో జిల్లా బీసీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ రాహుల్ రాజ్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

-మెదక్ అర్బన్, సెప్టెంబరు 10

ఘన నివాళి..



ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత నీలం మధు

చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని చిట్కుల్‌లోని ఐలమ్మ కాంస్య విగ్రహానికి కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ మంగళవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తిని భావితరాలకు అందించాలన్న సంకల్పంతో దేశంలోనే అతి పెద్ద కాంస్య విగ్రహాన్ని చిట్కుల్ గ్రామంలో ప్రతిష్ఠించామని ఆయన గుర్తు చేశారు.

-పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 10

వర్గల్ విద్యాధరి క్షేత్రం పనితీరు అద్భుతం

- కంచి పిఠాధిపతులు శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామిజీ



కంచి పీఠాధిపతిని కలిసిన చంద్రశేఖర శర్మ సిద్ధాంతి

వర్గల్, సెప్టెంబరు 10 : వర్గల్ క్షేత్రంలో కంచి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాధరి క్షేత్రం నిర్వహణ అద్భుతంగా ఉందని కంచి పిఠాధిపతులు శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామిజీ ఉద్భోదించారు. మంగళవారం వర్గల్ విద్యాధరి క్షేత్రం వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు కంచి పీఠంకు వెళ్లి చాతుర్మాస్య దీక్షలో ఉన్న కంచి పీఠాధిపతిని కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా విద్యాధరి క్షేత్రం ఆలయ కమిటీ సభ్యులతో శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామిజీ మాట్లాడుతూ విద్యాధరి క్షేత్రం ద్వారా భక్తులకు మరింత సేవలు విస్తృతం చేయ్యాలని, ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించాలన్నారు. అనంతరం స్వామిజీని చంద్రశేఖర శర్మ సిద్ధాంతి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మర్పడగ శ్రీ సంతాన మల్లిఖార్జున క్షేత్రం నిర్వాహకుడు హరినాథ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గీతమ్‌లో ఉత్తేజకర పోటీలు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 10 : ఈ నెల 25న ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫార్మసీ విద్యార్థుల కోసం ఉత్తేజకర పోటీలను నిర్వహించాలని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ సంకల్పించింది. వ్యాస రచన, పోస్టర్, మౌఖిక ప్రదర్శన, క్విజ్ వంటివి పోటీలు ఉంటాయని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుర్తింపు పొందిన పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల ఫార్మసీ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ మెయిల్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. విజేతలకు బహుమతులు, అవార్డులను ప్రదానం చేస్తామని, మరిన్ని వివరాల కోసం విద్యార్థి సమన్వయకర్తలను సంప్రదించాలని పేర్కొన్నారు.

కాలువ కనుమరుగు.. రోడ్డుపై వరద పరుగు

కాలువ బఫర్ జోన్‌లో నిర్మాణాల ఫలితం.. ప్రజలకు ఇబ్బందులు



తెల్లాపూర్‌లోని వంద ఫీట్ల రోడ్డు(రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్)పై వరదనీరు

రామచంద్రాపురం, సెప్టెంబరు 10 : అధికారుల తప్పిదాలతో కాలువలు కనుమరుగవుతున్నాయి. ఫలితంగా వరదనీరు రోడ్లపై పరుగుపెడుతుండడంతో వాహనదారులు, ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. తెల్లాపూర్‌లోని చెలికుంట చెరువు అలుగు నీరు వరద కాలువ ద్వారా మేళ్ల చెరువులోకి చేరాలి. కానీ, కొందరు వ్యక్తులు ఆ కాలువను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడం నీరంతా రోడ్లపైకి వస్తున్నది. కాలువ పై భాగంలో బఫర్ జోన్‌లో ఓ ఓ బిల్డర్ నిర్మాణాలు చేపడుతుండడంతోపాటు ఆ వ్యర్థాలను కాలువలో డంప్ చేస్తూ పూడ్చే ప్రయత్నం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. 33 ఫీట్ల వెడల్పుతో పారుతున్న ఈ కాలువపై గత ప్రభుత్వ హయాంలో ఇద్దరు మాజీ మంత్రుల అండదండలతో ఓ బిల్డర్ వంతెన నిర్మాణానికి అనుమతి పొంది సొంత ఖర్చుతో కేవలం 15 నుంచి 18 ఫీట్ల వెడల్పుతో వంతెన నిర్మించాడు. ఈ వంతెన కేవలం తన భూమిలోకి వెళ్లడానికే ఉపయోగపడుతుంది. ఈ విషయంలో అధికారులు బిల్డర్‌కు అనుకూలంగా వ్యవరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వంతెనతో పాటు, అక్రమ నిర్మాణలతో వరద కాలువకు పలు ఆటంకాలు ఏర్పడి మేళ్ల చెరువుకు చేరాల్సిన నీరు రోడ్లపై పారుతున్నది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది.



వరద కాలువపై నిర్మించిన వంతెన

తమను సంప్రదించకుండా కల్వర్టులు కట్టారు..

రేడియల్ రోడ్డు, కల్వర్టుల నిర్మాణానికి కాంట్రాక్టరు, సంబంధిత అధికారులు తమను సంప్రదించలేదని ఇరిగేషన్ ఏఈ సంతోషిని స్పష్టం చేశారు. 15 మీటర్ల వెడల్పుతో పారుతున్న వరద కాలువకు 2 లేదా 3 మీటర్ల వెడల్పుతో వంతెన నిర్మిస్తే ఎలా సరిపోతుందన్నారు. అందుకే రోడ్డుపై నీరు పారుతుందన్నారు. వరద తీవ్రత, కాలువల వెడల్పులపై కల్వర్టు నిర్మాణం ఆధారపడి ఉంటుందన్నారు.

తొమ్మిది రోజుల తరువాత గర్భగుడిలో పూజలు

- ఏడుపాయల్లో తగ్గిన వరద



పాపన్నపేట, సెప్టెంబరు 10: మంజీర వరదలు తగ్గుముఖం పట్టాయి. దీంతో తొమ్మిదిరోజుల పాటు జల దిగ్బంధంలో చిక్కుకున్న మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని వనదుర్గమ్మ ఆలయం మంగళవారం తెరుచుకున్నది. ఆలయాన్ని శుద్ధిచేసిన అర్చకులు.. అనంతరం దుర్గమ్మను ఎరుపు రంగు వస్త్రాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి, భక్తుల దర్శనానికి అనుమతించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ నెల 1 నుంచి మంజీర నది వరదలు ఆలయాన్ని ముంచెత్తడంతో, రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే.



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పట్టుబడిన పుష్ప బ్యాచ్

140 కిలోల గంజాయి స్వాధీనం

జహీరాబాద్, సెప్టెంబరు 10: గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న 140 కిలోల ఎండు గంజాయిని సోమవారం సాయంత్రం పట్టుకుని, నిందితులను అరెస్టు చేశామని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. ఈనెల 9న సాయంత్రం చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రహదారిపై ఆనంద్ దాబా వద్ద ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి జహీరాబాద్ మీదుగా కర్ణాటకకు వెళ్తున్న బొలెరోను తనిఖీ చేయగా.. వెనకభాగంలో చెక్క కింద ఉంచిన 140 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. ఈ మేరకు బొలెరో వాహనాన్ని, 140 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, లఖన్, సిద్ధిఖ్‌ను అరెస్ట్ చేశామన్నారు. పరారీలో ఉన్న సునీల్, కిరణ్, మల్లేష్‌నాయక్‌లను త్వరలో పట్టుకుంటామని ఎస్పీ చెప్పారు. గంజాయి విలువ రూ.35 లక్షలు ఉంటుందన్నారు. కాగా ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన రాహుల్ అనే వ్యక్తి ద్వారా కర్ణాటకలోని బాల్కికి చెందిన మల్లు గొండ అనే నేర ప్రవృత్తిగల వ్యక్తికి లఖన్ (శంషాపూర్‌వాడి-బాల్కి, బీదర్), సిద్ధిరామ్(బసవేశ్వరచౌక్-బాల్కి), సునీల్, కిరణ్, మల్లేష్‌నాయక్ ద్వారా కార్లలో, బొలెరో వాహనాల్లో గంజాయిని తీసుకొచ్చి అప్పగిస్తామని నిందితులు చెప్పారు. అదే తరహాలో వీరంతా కలిసి ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి నుంచి బొలెరోలో 140 కిలోల ఎండు గంజాయిని తరలిస్తున్నారని ఎస్పీ తెలిపారు. గంజాయి అక్రమ రవాణాను గుట్టురట్టు చేసిన జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, పట్టణ సీఐ శివలింగం, చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి, పోలీసులను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు విజయ్‌క్రిష్ణ, రమేష్, మల్లేష్, శ్రీకాంత్, మాణిక్‌రెడ్డి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

మిషన్ భగీరథ.. కార్మికుల వ్యథ!

- అగమ్య గోచరంగా ఉద్యోగుల పరిస్థితి
- 25 మందికి పది నెలలుగా అందని వేతనాలు
- స్పందించని అధికారులు
- చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- కాశీపూర్‌లో భగీరథ ట్యాంకు వద్ద నిరసన



కాశీపూర్ మిషన్ భగీరథ ట్యాంకు వద్ద మంగళవారం ఆందోళన చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

కంది, సెప్టెంబరు 10: సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కంది మండలంలోని మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులు పరిస్థితి దయనీయంగా మారింది. పది నెలలుగా వేతనాలు లేక అవస్థలు పడుతున్నారు. జీతాల కోసం కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా స్పందించడం లేదని, అధికారులు సైతం చేతులెత్తేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు వెంటనే జీతాలు ఇప్పించాలని కోరుతూ కాశీపూర్‌లోని మిషన్ భగీరథ ట్యాంకు వద్ద మంగళవారం కార్మికులు యాదయ్య, నర్సింహులు, శ్రీను, రవి, రాజ్‌కుమార్, సాయి, గురువయ్య, శ్రీకాంత్, గోవింద్, లక్ష్మణ్, కైసర్ ఆందోళన చేశారు.

సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 200 పైచిలుకు కాంట్రాక్ట్ కార్మికులు ఉండగా.. ఒక్క కంది మండలంలో దాదాపు 25 మంది ఉన్నారు. వీరి జీతం నెలకు రూ.9,500. వీరిలో లైన్‌మన్లుగా వ్యవహరించేవారు ఎక్కువగా ఉన్నారు. వీరంతా మండలంలో ఆయా గ్రామాలకు ఉన్న మిషన్ భగీరథ సరఫరా లైన్ లీకేజీలు లేకుండా, నీటి సరఫరాలో అంతరాయం కలుగకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తుంటారు. అయితే వీరికి జీతాలు పండుగకు మాత్రమే అందుతాయి. అది కూడా ఆరునెలలు కష్టపడితే రెండునెలల వేతనం ఇస్తారు. మండల పరిధిలోని ఓడీఎఫ్ నుంచి నీరు సరఫరా అయ్యే పైప్‌లైన్ రిపేర్ చేస్తూ గతేడాది ఓ కార్మికుడికి దెబ్బ తగిలింది. రూ.లక్ష అప్పుచేసి కార్మికుడే చికిత్స చేయించుకున్నాడు. మిషన్ భగీరథ కాంట్రాక్టర్ కానీ, సంబంధిత అధికారులు కానీ ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఇప్పటివరకు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాదబీమా వంటి సౌకర్యాలు లేవని కార్మికులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తమకు వేతనాలు ఇప్పించాలని మిషన్ భగీరథ కార్మికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

కాంట్రాక్టర్‌కు బిల్లులు రాక జీతాలు ఇవ్వడంలో జాప్యం

మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికులకు కొన్నినెలలుగా జీతాలు రాకపోవడం వాస్తవమే. ఈ విషయంలో మేం కూడా కాంట్రాక్టర్‌ను అడిగాం. కాంట్రాక్టర్‌కు కూడా ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో వేతనాల విషయం ఆలస్యమవుతున్నది. త్వరలోనే అందరికీ జీతాలు అందేలా చర్యలు తీసుకుంటాం.

- విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఈఈ

పదినెలలుగా జీతాలు లేవు



పదినెలలుగా జీతాలు లేక మా కుటుంబం గడిచే పరిస్థితి లేదు. ఇప్పటికే బతకడానికి ఎన్నో అప్పులు చేశాం. ఆరోగ్య సమస్యలు వస్తే పట్టించుకునే నాధుడే లేరు. అధికారులు ఎప్పుడు పిలిచినా విధులకు వెళ్లాలి. పైపులు లీకైనప్పుడు మరమ్మతులు పూర్తిచేసి, నీటి సరఫరా అయ్యేవరకూ అన్నం, నీళ్లు లేకుండా పనిచేస్తాం. ఉన్నతాధికారులు ఒక్కసారి మా పరిస్థితి ఆలోచించి జీతాలు ఇప్పించాలి.

- నర్సింహులు, మిషన్ భగీరథ కార్మికుడు

అప్పులు చేసి బతకలేకపోతున్నాం



నెలలు తరబడి జీతాలు రాకపోవడంతో అప్పులుచేసి బతుకుతున్నాం. బతుకు భారం అవుతున్నది. అప్పుల వాళ్లు మమ్మల్ని వేధిస్తున్నారు. మా పైఅధికారులకు జీతాల విషయమై చాలాసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. పనులు మాత్రం చేయించుకుంటారు. ఇలాంటి పరిస్థితి మరే కార్మికుడికి రావద్దు. ఉన్నతాధికారులు దయచేసి మాకు వెంటనే జీతాలు ఇప్పించాలి.

- యాదయ్య, మిషన్ భగీరథ కార్మికుడు

ఎడారి దేశంలో అనామక చావు

- దుబాయిలో మెదక్ జిల్లావాసి మృతి
- ఉపాధి కోసం నెల క్రితమే వలస
- మృతదేహాన్ని తెప్పించాలని కుటుంబ సభ్యుల వేడుకోలు



వసురామ్(ఫైల్)

హవేళిఘణపూర్, సెప్టెంబరు 12: ఉపాధి కోసం దుబాయ్ దేశానికి వలస వెళ్లిన ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా హవేళిఘణపూర్ మండలంలోని సుల్తాన్‌పూర్‌తండాలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. కుటుంబీకుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన రమావత్ వసురామ్(40) నెలరోజుల క్రితం ఉపాధి కోసం దుబాయ్‌కు నిజామాబాద్ జిల్లాలోని ఓ ఏజెంట్ ద్వారా వలస వెళ్లాడు. వారం క్రితం కంపెనీ నుంచి బయటకు వచ్చిన వసురామ్ అనారోగ్యంతో మృతిచెందినట్లు ఏజెంట్ ఫోన్‌చేసి తెలిపాడు. వసురామ్ మరణవార్త ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయాన్ని ఎవరికి విన్నవించాలో తెలియక కుటుంబీకులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తమ కుటుంబ పెద్ద దిక్కైన వసురామ్‌ను కడసారి చూసే భాగ్యం కల్పించాలని వేడుకుంటున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అధికారులు, నాయకులు స్పందించి తన భర్త మృతదేహన్ని స్వగ్రామానికి తీసుకురావాలని భార్య వేడుకుంటోంది.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో పోలీసులు

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 10 : రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్లో అమ్ముతున్నారని సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం దాడిచేసి పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్, టూ టౌన్ పోలీసులు రైడ్ చేసి 55 క్వింటాళ్ల రేషన్ బియ్యం, రైస్ అమ్మిన డబ్బులు రూ.15,980 స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో సిద్దిపేటకు చెందిన మాడ శ్రీనివాస్, కోదండమ్ శంకర్, తూర్పాటి అశోక్, వానరాశి సంజీవ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులకు 8712667445, 8712667446, 8712667447 నంబర్ల ద్వారా సమాచారం అందించాలని సూచించారు.

మామకు తలకొరివి పెట్టిన కోడలు



మామకు తలకొరివి పెడుతున్న కోడలు

చేగుంట , సెప్టెంబరు 10: మామకు కోడలు తలకొరివి పెట్టిన సంఘటన చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన వీరగొని భూమాగౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. అతని కుమారు ఎల్లగౌడ్ కూడా కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఎల్లగౌడ్‌కు ముగ్గురు ఆడ పిల్లలుకాగా పెండ్లి అయ్యింది. దీంతో ఎల్లగౌడ్ భార్య లక్ష్మి మామకు తలకొరివి పెట్టింది.

డిజిటల్ యాప్స్‌తో విప్లవాత్మక మార్పులు

- జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్



డిజిటల్ యాప్స్ కోర్సు వివరాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న వ్యవసాయ అధికారి గోవింద్ సిబ్బంది

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 10 : రాబోయే రోజుల్లో వ్యవసాయ రంగంలో డిజిటల్ యాప్స్‌తో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో డిజిటల్ యాప్, డిజిటల్ లైబ్రరీ, డిజిటల్ వ్యవసాయ కోర్సులు, క్యాబి బయో ప్రొటెక్షన్ పోర్టల్, ప్లాంట్ వైస్ ప్లస్నాలెడ్జ్ బ్యాంక్, క్రాప్ స్ప్రేయర్ వంటి యాప్‌లకుసంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునికత సాంకేతికతను అందిపుచ్చుకున్నప్పుడే వ్యవసాయ రంగంలో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు రాజ్ నారాయణ, సోమలింగారెడ్డి, హర్ష, దేశి కోఆర్డినేటర్ అమరేష్‌కుమార్, సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్ దక్షిణాసియా కోఆర్డినేటర్ మధుమంజరి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 10 : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నేతి కైలాసం తెలిపారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలకు 80 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 16 మంది బాలికలు, 16 మంది బాలురను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నేతి కైలాసం మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా జట్టు ఈ నెల 21, 22, 23న సిరిసిల్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి మేరీ, పీఈటీలు వెంకటేశ్వర్లు, సతీష్, రాజ్‌కుమార్, మహేష్, నవీన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జూనియర్ అథ్లెటిక్ పోటీలు

- రాష్ట్రస్థాయి 30 మంది ఎంపిక

మెదక్ అర్బన్, సెప్టెంబరు 10 : తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ జిల్లా స్థాయి పోటీలు మంగళవారం స్థానిక ఇందిరాగాంధీ మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. 400 మంది క్రీడాకారులు పాల్గొనగా.. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 19, 20వ తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మధుసూదన్ తెలిపారు.

జాతీయ పోటీలకు మయాంషిరెడ్డి ఎంపిక



మయాంషిరెడ్డి

వట్‌పల్లి, సెప్టెంబరు 10 : మండలంలోని గొర్రెకల్ గ్రామానికి చెందిన విద్యార్థిని మయాంషిరెడ్డి జాతీయస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికైంది వట్‌పల్లిలోని మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శివరాంరెడ్డి కూతురైన మయాంషిరెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతుంది. అండర్ 14 బాలికల విభాగంలో తమిళనాడులో నిర్వహించిన జాతీయ క్రికెట్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం సాధించింది. తాజాగా జాతీయ స్థాయిలో నిర్వహించబోయే ఖేలో ఇండియా-24 పోటీలకు ఎంపికైంది.

రికార్డుల నిర్వహణలో పొరపాట్లు ఉండొద్దు: ఎంపీడీవో



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో, ఎంపీవో

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 10: గ్రామ పంచాయితీ రికార్డుల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవలని ఎంపీడీవో శ్రీరాములు సూచించారు. నారాయణరావుపేట గ్రామ పంచాయితీ రికార్డులను మంగళవారం ఎంపీవో శ్రీనివాస్‌రావుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీలకు వచ్చే స్టేట్ ఫైనాన్స్ ఉపాధిహామీ నిధులు, జనరల్ ఫండ్, కేంద్ర నిధుల వినియోగానికి సంబంధించిన క్యాష్ బుక్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

నిర్మాణం పూర్తి కాలేదు.. ప్రజల వెతలు తీరలేదు

- నిర్మాణ దశలోనే ఆరోగ్య ఉప కేంద్రం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు
- పట్టించుకోని అధికారులు

చిన్నకోడూరు, సెప్టెంబరు 10: ఈ చిత్రంలో పిచ్చి మొక్కలు, గడ్డి పొదల మధ్య మీరు చూస్తున్నది ఏదో శిథిలావస్థకు చేరిన భవనం అనుకుంటే పొరబడినట్లే. ఎందుకంటే అది నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం భవనం. చిన్నకోడూరు మండలం కేంద్రంలో నూతన ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణ పనులు రూ. 18 లక్షలతో ప్రారంభించారు. సుమారు 90 శాతం భవనం పనులు పూర్తి అయ్యాయి. భవనానికి పెయిటింగ్, భవనం లోపల డోర్‌లు తదితర పనులు ఇంకా పూర్తికాలేదు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ భవనం చుట్టూ పిచ్చి మొక్కలు, గడ్డి పొదలు ఏపుగా పెరిగాయి.



ఉప కేంద్రం చుట్టూ మొలిచిన పిచ్చి మొక్కలు

గ్రామ పంచాయతీ కార్యాలయంలో...

నూతన ఆరోగ్య ఉపకేంద్రం భవనం నిర్మాణ పనులు పూర్తి కాక ముందే, శిథిలావస్థకు చేరిందని పాత సబ్ సెంటర్ భవనాన్ని సుమారు ఏడాది క్రితం కూల్చివేశారు. సుమారు 5 నెలల పాటు అద్దె భవనాల్లో సబ్ సెంటర్ సేవలను ఏఎన్ఎం, ఆశావర్కర్‌లు కొనసాగించారు. ఆ తర్వాత నుంచి స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సేవలను కొనసాగిస్తున్నారు. ఆయా పనుల నిమిత్తం గ్రామ పంచాయతీ కార్యాలయానికి ప్రజలు రావడంతో పాటు, ఉప కేంద్రానికి వైద్య సేవల కోసం గర్భిణిలు, బాలింతలు, రోగులు వెళ్తున్నారు. దీంతో అక్కడ ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆరోగ్య ఉప కేంద్ర భవనం పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి పంచాయతీరాజ్ ఏఈ బ్రహ్మాన్ని సంప్రదించగా భవనం పనులు 90 శాతం పూర్తి అయ్యాయని, ఇంకా 10 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మిగిలిన పనులు పూర్తి చేయడానికి సుమారు రూ. 2లక్షల నిధులు అవసరమని నిధులు లేకపోవడంతో భవనం పనులు నిలిచిపోయానని ఆయన తెలిపారు.

ఆస్తి పంపకాల్లో గొడవ.. వ్యక్తి ఆత్మహత్య

దుబ్బాక, సెప్టెంబరు 10: ఆస్తి పంపకాల్లో గొడవ జరిగి ఆవేశంలో గడ్డి మందు గులికలను మింగి ఆత్మహత్యయత్నానికి పాల్పడి ఓ వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది. సంఘటనకు సంబంధించి దుబ్బాక ఎస్ఐ గంగరాజు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలయ్య(39) అనే రైతుకు అతడి తండ్రికి భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో కలత చెందిన అతడు ఈ నెల 3న గడ్డిమందును తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడాడు. వెంటనే సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందినట్టు తెలిపారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు.. ముగ్గురికి గాయాలు



బోల్తా పడిన కారు

గజ్వేల్, సెప్టెంబరు 10: డివైడర్‌ను కారు ఢీకొని ముగ్గురికి స్వల్ప గాయాలైన సంఘటన గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్లలో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. వేములవాడకు చెందిన శ్రీధర్ హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తమ పనినిమిత్తం వేములవాడకు కారులో బయలుదేరాడు. ఈ క్రమంలో కొడకండ్లలోని రాజీవ్‌రాహాదారిపై కారు డివైడర్‌ను ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని గజ్వేల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కుకునూరుపల్లి పోలీసులు తెలిపారు.

పోరాట స్ఫూర్తికి నిదర్శనం ఐలమ్మ

పోరాట స్ఫూర్తికి నిదర్శనం చాకలి ఐలమ్మ అని అధికారులు, నాయకులు పేర్కొన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆమె విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



సిద్దిపేట కలెక్టరేట్: కలెక్టరేట్లో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్



చేర్యాల: ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



సిద్దిపేట అర్బన్: ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్



గజ్వేల్: ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పోలీస్‌స్టేషన్ మంజూరు చేయించండి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని కోరిన బీజేపీ నాయకులు



బండి సంజయ్‌కుమార్‌తో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు10: నారాయణరావుపేట మండలానికి పోలీస్ స్టేషన్ మంజూరు చేయించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కోరినట్లు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జిల్లెల్ల రమేష్‌గౌడ్ తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని కరీంనగర్‌లో ఆయన నివాసంలో మంగళవారం కలిసినట్లు చెప్పారు. నారాయణరావుపేట మండల కేంద్రం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలను గత ప్రభుత్వం అసంపూర్తిగా ఏర్పాటు చేసిందని, దీంతో మండల ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన పోలీసుస్టేషన్ మంజూరు అయ్యేలా కృషి చేస్తానని, సమయం చూసుకుని మండలానికి వస్తానని చెప్పినట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గడ్డం స్వామిగౌడ్, మహేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తాం

- తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్



సభలో మాట్లాడుతున్న భూపాల్

గజ్వేల్, సెప్టెంబరు 10: వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను మంగళవారం గజ్వేల్ పట్టణంలో నిర్వహించారు. చిట్యాల ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ప్రజ్ఞాపూర్‌లోని ఆమె విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం ప్రజ్ఞాపూర్ నుంచి గజ్వేల్ అంబేడ్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓ గార్డెన్‌లో నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. ఎర్రజెండాల నాయకత్వంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరిగిందని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాత్రలేని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు తెలంగాణ పోరాటాన్ని వక్రీకరిస్తున్నాయని ఆరోపించారు. ఈ సభకు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య అధ్యక్షత వహించగా, సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, కాముని గోపాలస్వామి, శశిధర్, రవి, బండ్ల స్వామి, రంగారెడ్డి, ప్రశాంత్, అరుణ్, వెంకటచారి, ప్రవీణ్, చంద్రశేఖర్‌రెడ్డి, కనకయ్య, అహ్మద్, బాబురావు, ఎల్లం, యాదగిరి పాల్గొన్నారు.

అధిక సాంద్రత పంటలతో ఎక్కువ దిగుబడులు

- కృషి విజ్ఞాన, తునికి కేంద్ర వ్యవసాయ శాస్త్రవేత్తలు

కుకునూరుపల్లి, సెప్టెంబరు 10: అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని, ఖర్చులు కూడా తగ్గుతాయని కృషి విజ్ఞాన కేంద్ర, తునికి కేంద్రం శాస్త్రవేత్తలు ఎస్ దత్తాత్రేయ నాల్కర్, పి. రవికుమార్, ఎం ప్రతాప్ ఎరెడ్డిలు పేర్కొన్నారు. అధిక సాంద్రత పద్ధతిలో కుకునూరుపల్లిలో సాగు చేస్తున్న పత్తి పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిసెంబరు నెల చివరి కల్లా పంటలు ముగించి మరో కొత్త పంటను వేసుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి గోవిందరాజు మాట్లాడుతూ.. పత్తి పొలాల్లో నీరు ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వారివెంట పలువురు ఏఈవోలు తదితరులు ఉన్నారు.



కుకునూరుపలి: అధిక సాంద్రత పద్ధతిలో సాగుచేస్తున్న పత్తి పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మొక్కజొన్న పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

దూళిమిట్ట, సెప్టెంబరు 10: మండలంలోని కూటిగల్‌కు చెందిన రైతు కొమ్మరాజుల రమేష్ రెండు రోజుల క్రితం తనకు నకిలీ విత్తనాలు అంటగట్టి మోసం చేశారని ఆరోపించడంతో పలు పత్రికల్లో వార్త ప్రచురితమైంది. దీంతో తోర్నాల వ్యవసాయ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మంగళవారం మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. పంట బాగుందని, ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్లు దిగుబడి వస్తుందనితెలిపారు. తలచుంచు సమయంలో బెట్టకు గురికావడంతో కొన్ని కంకులు చిన్నగా వచ్చాయని, రైతు ఆరోపించినట్లుగా నకిలీ విత్తనాలు కావని సరియైన నాణ్యమైన విత్తనాలే రైతుకు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అఫ్రోజ్, ఏఈవోలు అనూష, రాధిక తదితరులు పాల్గొన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

రాయపోల్, సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిచేలు ఎర్రబారడంతోపాటు పూత రాలుతున్నదని, నివారణ కోసం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి నరేష్ సూచించారు. రామారంలో పర్యటించి దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఆయనవెంట ఏఈవో ప్రవీణ్ ఉన్నారు.

- **మిరుదొడ్డి,** సెప్టెంబరు 10: అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలోని పత్తి, మొక్కజొన్న పంటలను స్థానిక వ్యవసాయాధికారి సత్యాన్వేష్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఆయనవెంట రైతులు, ఏఈవో సాయి ఉన్నారు.

ఆరోగ్య సమాజం కోసం.. పోషణ మాసం

- దుబ్బాక సీడీపీవో చంద్రకళ



దౌల్తాబాద్: పోషకాహారాలను పరిశీలిస్తున్న సీడీపీవో చంద్రకళ

దౌల్తాబాద్/హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 10: ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం పోషణ మాసోత్సవాలు చేపడుతుందని దుబ్బాక సీడీపీవో చంద్రకళ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో మంగళవారం సూపర్‌వైజర్ గిరిజ ఆధ్యక్షతన సీడీపీవో చంద్రకళ, డాక్టర్ నాగరాజు జ్యోతి ప్రజ్వలన చేసి పోషణ మాసోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దుబ్బాక ప్రాజెక్టు నేతృత్వంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం డాక్టర్ నాగరాజు గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ బ్లాక్ కో-ఆర్డినేటర్ శ్యాంసన్, ఉపాధ్యాయులు భూపతిరెడ్డి, పీఈటీ మోహన్, ఏపీఎం యాదగిరి, ఏఎస్ఎం కరుణ, ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచరు పాల్గొన్నారు.

పౌష్టికాహార మసోత్సవంలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణిలకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఐసీడీఎస్ పీవో జయ, కౌన్సిలర్లు వాల సుప్రజ, కోమటి స్వర్ణలత, బొజ్జ హరీశ్ తదితరులున్నారు.

చేతిరాత పుస్తకాల పంపిణీ

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 10: సాధన చేస్తే అందమైన చేతిరాత సొంతమవుతుందని, అందమైన చేతిరాతతో మంచి మార్కులు సాధించవచ్చని జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. చేతిరాత నిపుణుడు గడ్డం యాదగిరి రూపొందించిన 'అందమైన చేతిరాతకు సులభశైలిలో సువర్ణాక్షరాలు' అనే పుస్తకాలను మంగళవారం సిద్దిపేట ఇందిరానగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి చేతులమీదుగా విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజ ప్రభాకర్‌రెడ్డి, గడ్డం యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలి

మద్దూరు, సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పడి ప్రమాదకరంగా మారిన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కమిటీ కార్యదర్శి ఆలేటి యాదగిరి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో భారీ వర్షాలకు ప్రమాదకరంగా మారిన కల్వర్టును మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎండీ షఫీ, రమేష్, పిట్టల నరేష్, పరమేష్, రాజు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 10 : గురుకుల పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాల ప్రోగ్రెసివ్ పేరెంట్ లీగ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మెట్ల శంకర్ అన్నారు. ఎన్సాన్‌పల్లిలో సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మూర్తా, వైస్ ప్రిన్సిపాల్ ప్రియదర్శిని, ఉపాధ్యాయులు, పీపీఎల్ స్టేట్ కోఆర్డినేటర్ జనార్దన్, జిల్లా కమిటీ సభ్యులు మహేశ్వరం శ్రీనివాస్, మల్లేశం, రాజు తదితరులు ఉన్నారు.

'పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

మిరుదొడ్డి,సెప్టెంబరు 10: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎబీవీఎస్‌యూ దుబ్బాక డివిజన్ ఇన్‌చార్జి మనోహర్ డిమాండ్ చేశారు. మిరుదొడ్డిలోని ఓ ప్రైవేటు పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతోపాటు ప్రభుత్వ నిబంధనలను పాటించడంలేదని ఆరోపించారు. పాఠశాలలో ఫైర్‌సేఫ్టీ కూడా లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పాఠశాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పాఠశాల గుర్తింపును రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎబీవీఎస్‌యూ నాయకులు రవి, సతీష్, స్వామి తదితరలున్నారు.

ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు

- నోడల్ అధికారి సత్తయ్య



నమూనా పరీక్షను పరిశీలిస్తున్న సత్తయ్య

కుకునూరుపల్లి, సెప్టెంబరు 10: ఎన్‌సీసీ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని మండల నోడల్ అధికారి సత్తయ్య తెలిపారు. తిప్పారం, కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన నేషనల్ అచివ్‌మెంట్ సర్వే నమూనా పరీక్షను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఎన్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో ప్రతీ మూడు సంవత్సరాలకు ఒకసారి ఈ పరీక్ష నిర్వహిస్తామని, ఈ నవంబరులో పరీక్షలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ముందుగా నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నమూనా పరీక్ష పేపర్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్. రవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఐసెట్ ధ్రువపత్రాల పరిశీలన

నంగునూరు,సెప్టెంబరు 10: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం నంగునూరు మండలం రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళవాశాలలో నిర్వహిస్తున్న ఐసెట్ కౌన్సెలింగ్ మంగళవారం ముగిసిందని ప్రిన్సిపాల్ గోవర్ధన్ తెలిపారు. నాలుగు రోజులుగా నిర్వహించిన కౌన్సిలింగ్‌లో 969 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, 837 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిస్టం అడ్మిన్ అభినవ్, చీఫ్ వెరిఫికేషన్ అధికారి రాజు, వెరిఫికేషన్ అధికారులు విజయ్‌కుమార్, రాజమౌళి, శ్రీనివాస్, కవిత పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధిద్దాం

- స్టీల్ బ్యాంకులను సద్వినియోగం చేసుకోండి
- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 10: ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించి, అందరి సహకారంతో సిద్దిపేటను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో హోటల్ నిర్వాహకులు, ఫంక్షన్‌హాల్‌ల యజమానులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాస్‌ల వాడకం ఉండకూడదని, హోటల్‌లల్లో స్టీల్ ప్లేట్లు, గ్లాస్‌లను వాడాలని సూచించారు. పట్టణంలో ప్రతీ వార్డులో స్టీల్ బ్యాంక్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్డులోని ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరించాలి

వార్డులోని ప్రతీ ఇంటి నుంచి చెత్త వాహనాల సిబ్బంది చెత్త సేకరించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ ఆదేశించారు. సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం ఆయన పర్యటించారు. పట్టణంలోని వీధి కుక్కల జనన నియంత్రణ కేంద్రం నిర్వహణను పరిశీలించి, ఇప్పటివరకు ఎన్ని వీధి కుక్కలను పట్టుకున్నారని, ఎన్నింటికి జనన నియంత్రణ చేశారని, జనన నియంత్రణ చేసిన అనంతరం విశ్రాంతి గదుల్లో ఎన్ని కుక్కలు ఉన్నాయని ఆరాతీశారు. 6వ వార్డులోని సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. హరీశ్‌రావునగర్‌లో ఓ ఇంటి వద్దకు చెత్త వాహనం రాకపోవటంతో చెత్తను ఇంట్లోనే నిల్వ ఉండిపోయిందని కమిషనర్ దృష్టికి తీసుకరాగా, సంబంధిత పారిశుధ్య సిబ్బందిని పిలిపించి వెంటనే చెత్తను తీసుకెళ్లాలని సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్ బర్ల మలికార్జున్, ఏఈ అన్వేష్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది తదితరులు ఉన్నారు.

బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలి

- ఎస్జీటీయూ జిల్లా నాయకుడు శ్రీధర్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 10: బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలని ఎస్జీటీయూ జిల్లా నాయకుడు శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో గజ్వేల్ మండల ఎస్జీటీల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. వర్గల్ మండల ఎస్జీటీయూ అధ్యక్షుడు శ్రీనివాస్‌తో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూన్‌లో జరిగిన బదిలీల్లో స్థాన చలనం పొందిన ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకూ ఓటుహక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. 10వేల ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలని, ప్రతీ పాఠశాలకు కనీసం ముగ్గురు ఉపాధ్యాయులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గజ్వేల్ మండల నూతన అధ్యక్షుడిగా రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా సురేష్, ఉపాధ్యక్షులుగా ఆనంద్‌బాబు, సుధాకర్, పద్మ, కార్యదర్శులుగా రజిత, శ్వేత, ప్రవీణ్‌చారిని ఎన్నుకున్నారు.



గజ్వేల్ మండల కార్యవర్గానికి ఉత్తర్వులను అందజేస్తున్న శ్రీధర్‌రెడ్డి

'ఆయాచితం నటేశ్వరశర్మ మృతి తీరని లోటు'

వర్గల్/కొండపాక, సెప్టెంబరు 10: ప్రముఖ పండితులు డాక్టర్ ఆయాచితం నటేశ్వర శర్మ మృతి తెలంగాణ సాహితీ లోకానికి తీరనిలోటని వర్గల్ విద్యాధరి క్షేత్రం వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతు వర్గల్ విద్యాధరి క్షేత్రంతో ఆయనకు ఎంతో అనుబంధం ఉందని, ఆయన అవధాన భారతి పురస్కారం అందుకున్నట్లు గుర్తుచేశారు. కామారెడ్డి ప్రాంతానికి చెందిన ఆయన సాంస్కృత ఆంధ్ర ప్రధానాచార్యులుగా సుపరిచితుడని, కవి, రచయిత, అష్టావధానిగా ప్రసిద్ధికెక్కారని చెప్పారు.

కవి, అష్టావధాని ఆయాచితం నటేశ్వరశర్మ మరణం ధార్మిక సాహిత్యలోకానికి తీరని లోటని మర్పడగ క్షేత్ర నిర్వాహకులు విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చెప్పెల హరినాథశర్మ పేర్కొన్నారు. వారి కుటుంబసభ్యులకు ధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు10: టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్ కుమార్‌గౌడ్‌ను సిద్దిపేటకు చెందిన కాంగ్రెస్ నాయకులు తాడూరి శ్రీనివాస్‌గౌడ్, శివప్ప, తిరుపతిరెడ్డి, నాగరాజు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

మట్టి గణపతి ప్రతిష్ఠ.. కమిటీ సభ్యులకు సన్మానం

వర్గల్, సెప్టెంబరు 10: వర్గల్ మండలం నెంటూర్‌లో మట్టి గణపతిని ప్రతిష్ఠించిన హనుమాన్ భక్త బృందం సభ్యులను మంగళవారం గజ్వేల్ రామకోటి భక్త సమాజం వ్యవస్థాపకుడు రామరాజు సన్మానించారు. కార్యక్రమంలో హనుమాన్ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

- **మిరుదొడి:** మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని రక్షించాలని యువభారత్ యూత్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి అన్నారు. మిరుదొడ్డిలో వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా మట్టివినాయకుడికి పూజలు చేశారు. కార్యక్రమంలో యువభారత్‌యూత్ నాయకులు పరుశురాములు, కుమార్ తదితరులున్నారు.
- **చేర్యాల:** వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని వైశ్యభవన్‌లో మంగళవారం గణపతికి గరికపూజ ఘనంగా నిర్వహించారు. అలాగే వాసవీ కాలనీలో వినాయకుడికి విశేషపూజలు నిర్వహించారు. శివలింగం, త్రిశూలం, డమరుకం ఆకృతిలో పూలను అలంకరించి పిండి ప్రమిదల జ్యోతులు వెలిగించి నీరాజనం పలికారు.

ఆటోలో ప్రయాణించే మహిళల రక్షణకే అభయ యాప్

- సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, గజ్వేల్ సీఐ బి.సైదా

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 10: ఆటోల్లో ప్రయాణించే మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అభయ యాప్‌ను తీసుకువచ్చిందని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఓల్డ్ బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు మంగళవారం అభయ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట పట్టణం పరిసర ప్రాంతాల ఆటో డ్రైవర్లందరికీ త్వరలో అభయయాప్ స్టిక్కర్లను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్ రెడ్డి, ఏఎస్ఐలు ఉమేష్, రఘు, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట కల్చరల్: డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన షీ టీమ్ ఫిర్యాదుల బాక్సు

- **గజ్వేల్:** అభయయాప్‌పై గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆటో డ్రైవర్లకు గజ్వేల్ సీఐ బి.సైదా అవగాహన కల్పించారు. ప్రతీ ఆటోడ్రైవర్ స్టిక్కర్స్ వేసుకోవాలని, ఆర్‌సీ, ఫొటోస్, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డులను సమర్పిస్తే క్యూఆర్ కోడ్ సంబంధించిన స్టిక్కర్ రూపొందిస్తామన్నారు.
- **సిద్దిపేట క్రైం:** మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సిద్దిపేట టూ టౌన్ సీఐ ఉపేందర్ అన్నారు. సోమవారం రాత్రి సిద్దిపేట పట్టణంలోని నెహ్రూ పార్కు వద్ద పోలీస్ కళాబృందంతో కనువిప్పు కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నెహ్రూ పార్కు పరిసర ప్రాంతాల ప్రజలు వ్యాపారస్తులు, పోలీస్ కళాబృందం సభ్యులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- **నంగునూరు:** కులమత బేధాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం నిర్వహించాలని సిద్దిపేట రూరల్ సీఐ శీను సూచించారు. నంగునూరులో వినాయక మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత నిమజ్జన కార్యక్రమంలో డీజే వినియోగించవద్దని, మద్యం సేవించి నిమజ్జనం నిర్వహించవద్దన్నారు. కార్యక్రమంలో రాజగోపాలపేట ఎస్ఐ ఎండీ. ఆసీఫ్, హెడ్‌కానిస్టేబుల్ సంపత్, కానిస్టేబుల్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు .



సిద్దిపేట క్రైం: ఆటోడ్రైవర్లకు, ప్రజలకు అభయ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

- **సిద్దిపేట కల్చరల్:** విద్యార్థినులతో ఎవరైనా అవహేళనగా మాట్లాడినా, ఇబ్బందులకు గురిచేసినా ఒక చీటి రాసి షీటీమ్ బాక్సులో వేయాలని మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ సూచించారు. సిద్దిపేట డిగ్రీ కళాశాల ఆవరణలో షీ టీమ్ కంప్లైంట్ బాక్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ దుర్గ విద్యార్థినులకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు కృష్ణయ్య, రజిని, హరిబాబు, సిద్దిపేట షీటీమ్ బృందం సభ్యులు ఉన్నారు.

అపరిశుభ్రంగా 'మున్సిపల్' టాయిలెట్లు

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని పట్టణవాసులకు పదేపదే చెబుతున్నా మున్సిపల్ అధికారులకు మాత్రం తమకు ఈ నిబంధన వర్తించదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. సిద్దిపేట మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న టాయిలెట్లు అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. వివిధ పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి వచ్చే పట్టణ వాసులకు కార్యాలయంలోని మరుగుదొడ్లకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల సరైన నిర్వహణ లేకపోవడంతో టాయిలెట్లు కంపు కొడుతున్నాయి. మున్సిపల్ కార్యాలయంలోనే ఇలా ఉంటే పట్టణంలో నిర్మించిన మున్సిపల్ బాత్‌రూంలు, సులబ్ కాంప్లెక్స్‌లపరిస్థితి ఏంటని పట్టణ వాసులు ముక్కుమీద వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి టాయిలెట్లను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరుతున్నారు.

- సిద్దిపేట టౌన్